సాక్షి అనకాపల్లి

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



ఎంత గిట్టుబాటవుతుంది?

కలెక్టర్ నుడిగాలి పర్యటన చేశారు. ఉపాధి పనులను పరిశీలించి, పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. 8లో



కమిషనర్ బాధ్యతల స్వీకారం

విశాఖ: జీవీఎంసీ కొత్త కమిషనర్ సాయి కాంత్‌వర్మ బాధ్యతలు స్వీకరించారు. మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



జై బోలో హనుమాన్‌కీ..

విశాఖ: విశ్వహిందూ పరిషత్ శనివారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించింది. యాత్ర జాతర వాతావరణాన్ని తలపించింది.

రంజాన్ వేళలు

అనకాపల్లి

ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
6-17	4-24

నర్సీపట్నం

ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
6-20	4-23

న్యూస్‌రీల్

తారువలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: తారువలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు రూ.3.80 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. విద్యుత్ ఉప కేంద్రం నిర్మించబోయే స్థలాన్ని ఈపీడీసీఎల్ అధికార్లతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. తారువ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు విద్యుత్ సదుపాయాన్ని మరింత మెరుగుపర్చేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన వెంట ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం ఈఈ జి.సురేష్‌బాబు, చోడవరం డీఈఈ యు.కె.గౌరీప్రసాద్, స్థానిక ఏఈ కె.శంకరరావు తదితర విద్యుత్‌శాఖ సిబ్బంది ఉన్నారు.

పోషక లోపం చిన్నారులకు తక్షణ వైద్యం



ఎన్‌ఆర్‌సీలో చికిత్స పొందుతున్న చిన్నారిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

నర్సీపట్నం: పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు సకాలంలో వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ.హేమంత్ సూచించారు. ఏరియా ఆస్పత్రిలోని పోషకాహార పునరావాస కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. నెల నుంచి ఐదేళ్లలోపు వయసున్న చిన్నారుల్లో పౌష్టికాహార లోపంతో బాధపడే వారిని కేంద్రంలో చేర్చి, సకాలంలో వైద్యం అందించాలన్నారు. చీడిగుమ్మలకు మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించినట్టు వెల్లడించారు.

'పని ఒత్తిడి తగ్గించండి'



సమస్యలపై జేసీ జాహ్నవికి వినతిపత్రం అందిస్తున్న సర్వేయర్లు

తుమ్మపాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం (రీసర్వే)లో తాము తీవ్ర పని ఒత్తిడికి లోనవుతున్నామని సర్వేయర్లు జేసీ ఎం.జాహ్నవికి మొరపెట్టుకున్నారు. ఏపీ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కలెక్టరేట్‌లో జేసీని కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ సెలవు దినాల్లో విధుల నుంచి మినహాయింపు, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకే పనివేళల్ని పరిమితం చేయడం, డిప్యుటేషన్లు మండల పరిధిలోనే కేటాయింపు, బీఎల్‌వో విధుల నుంచి మినహాయింపు తదితర అంశాల్ని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఉపమాక వెంకన్న సాక్షిగా... జగనన్నపై నమ్మకమే శ్వాసగా..

జన సంద్రం

- వేలాదిమంది కార్యకర్తలతో భారీ ర్యాలీ
- స్వచ్ఛందంగా తరలివచ్చిన జనవాహిని
- పాల్గొన్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే బాబూరావు



లబ్ధిదారుడి ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు, ఎంపీ సత్యవతి



జనసందోహం మధ్య ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బాబూరావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటరామయ్య, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ

నక్కపల్లి: పార్టీ కార్యకర్తలు పోటెత్తారు. వారితో ప్రజలూ పాదం కదిపారు. వెరసి ఉపమాక గ్రామం జన సంద్రమైంది. వెంకన్న సాక్షిగా 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభిమానులు, పార్టీ కార్యకర్తలు వేలాదిగా తరలి వచ్చి కదం తొక్కారు. శనివారం ఉపమాకలో నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, పాయకరావుపేట నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య పాల్గొన్నారు. ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతిని, ఉపమాక వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం తప్పెటగుళ్లు, మేళతాళాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రజల ఇళ్లకు వెళ్లి వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల గురించి ఎమ్మెల్యే బాబూరావు, ఎంపీ సత్యవతి ఆరా తీశారు. ఏయే పథకాలు అందుతున్నాయనే వివరాలు నమోదు చేసుకున్నారు. వాటిలో ఏమైనా లోపాలుంటే తెలియజేయాలన్నారు. ప్రజలంతా ముక్తకంఠంతో.. సీఎం జగన్ వల్ల తమకు ఇన్ని పథకాలు అందుతున్నాయని, ఆయనే తమకు దేవుడని స్పష్టం చేశారు. అనంతరం లబ్ధిదారుల అడ్రసు, ఫోన్ నంబర్లు నమోదు చేసుకుని వారికి రసీదు అందజేశారు. లబ్ధిదారుల ఫోన్ నుంచి 8296082960 నంబరుకు మిస్‌కాల్ ఇప్పించి, జగనన్నతో మాట్లాడించారు. వారి అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' అనే స్టిక్కర్‌ను ఇళ్లకు అతికించారు.

జగన్ ప్రభంజనాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబూరావు, ఎంపీ సత్యవతి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను నిరాటంకంగా నాలుగేళ్ల నుంచి అమలు జరుపుతున్న జగనన్న కోట్లాది మంది హృదయాల్లో నిలిచిపోయారన్నారు. ప్రభుత్వం మారితే ఈ పథకాలన్ని నిలిచిపోతాయనే భయం ప్రజల్లో నెలకొందన్నారు. మరో పర్యాయం జగనన్నను గెలిపించుకుని రెండు పూటలా కడుపు నింపుకోవాలని, తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్, తమ కుటుంబాలకు మంచి ఉపాధి అవకాశాలను కల్పించుకోవాలన్న తపనతో ప్రజలు ఉన్నారన్నారు. జగన్ ప్రభంజనాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదన్నారు. వెంకన్న సాక్షిగా మళ్లీ 2024 ఎన్నికల్లో 175 స్థానాలను గెలుచుకుని జగనన్న రెండోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ నాయకుడు మనబాల తాతారావు, జిల్లా స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కొల్నాటి బుజ్జి నాయకత్వంలో వేలాది మంది తరలివచ్చారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, మాజీ డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు నేతల రత్నకుమారి, తళ్ల భార్గవ్, కొండలరావు, సురేష్‌వర్మ, కర్రి రాజబాబు, మైలపల్లి శ్రీనివాస్, సురేష్‌రాజు, ఆనందరావు, పొడగట్ల వెంకటేష్, శంకర్రావు, రాఘవకుమారి, ఎంపీటీసీలు గంటా తిరుపతిరావు, ,గొర్ల గోవిందు పాల్గొన్నారు.

మెగా పీపుల్స్ సర్వేకి విశేష స్పందన

- నాలుగేళ్ల పాలనలో అభివృద్ధే రానున్న ఎన్నికల్లో శ్రీరామరక్ష
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కన్నబాబురాజు

సాక్షి, అనకాపల్లి: గత వారం రోజులుగా 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేకు విశేష స్పందన లభించిందని ప్రభుత్వ విప్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ చెప్పారు. వారం రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 64 లక్షల కుటుంబాలను కలిశామని, 49 లక్షల మంది మిస్డ్ కాల్స్ ఇచ్చారన్నారు. శనివారం స్థానిక జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పాలనే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయానికి శ్రీరామరక్ష అని అన్నారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఎక్కడా అవినీతికి తావు లేకుండా.. రూ.2 లక్షల 20 కోట్లు సంక్షేమానికి ఖర్చు చేసినట్లు చెప్పారు. ఒక్కో నియోజకవర్గానికి రూ.1500 కోట్లు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈరోజు పేదలకు నాణ్యత గల విద్య, వైద్య అందుతోందని తాము గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు.

కష్టకాలంలోనూ ఆగని సంక్షేమం

అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ... కరోనాలాంటి కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగకుండా.. పేదలకు అండగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. సచివాలయ వ్యవస్థ యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, పలు రాష్ట్రాల ప్రతినిధులు ఇప్పటికే సచివాలయాలను సందర్శించడం అభినందనీయన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 7వతేదీన ప్రారంభించిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం కన్వీనర్లు, గృహసారథులతోపాటు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజల ముందు ధైర్యంగా వెళ్లగలుగుతున్నామంటే తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి వల్లనేనని గర్వంగా చెప్పారు. ఈనెల 20వ తేదీతో ఈ కార్యక్రమం ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ తదితరులు పాల్గొన్నారు.



ఉపమాక వేంకటేశ్వరుడిని దర్శించి ర్యాలీ ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆర్టీసీ 'చందనోత్సాహం'!

- ఈ ఏడాది 160 స్పెషల్ బస్సులు సిద్ధం
- వీటిలో కొండపైకి 56 ఉచితంగా నడపాలని నిర్ణయం
- తొమ్మిది ప్రధాన ప్రాంతాల నుంచి సర్వీసులు



సాక్షి, విశాఖపట్నం: అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సింహాద్రి అప్పన్న చందనోత్సవానికి ఆర్టీసీ ఉత్సాహంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 23న జరగనున్న అప్పన్న ఉత్సవానికి రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. వీరిలో సుమారు 80 వేల మంది బస్సుల్లో ప్రయాణిస్తారని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. వీరి కోసం విజయనగరం-అడవివరం, పాతపోస్టాఫీసు/ఆర్కే బీచ్-అడవివరం, తగరపువలస/భీమిలి-అడవివరం, మారికవలస/ పీఎంపాలెం-అడవివరం, అనకాపల్లి-గోశాల, చోడవరం/మాడుగుల/కొత్తకోట -గోశాల, గాజువాక/సింధియా-గోశాల, కొత్తవలస/దేవరాపల్లి-గోశాల, ద్వారకా బస్‌స్టేషన్-గోశాలలకు వెరసి తొమ్మిది ప్రధాన ప్రాంతాల నుంచి స్పెషల్ బస్సులను తిప్పనున్నారు. వీటిలో 56 బస్సులను ఉచిత సర్వీసులుగా నడపనున్నారు. సింహాచలం దేవస్థానం నడిపే బస్సులకు ఇవి అదనం. ఈనెల 23 తెల్లవారుజామున 2 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ బస్సులను నడపనున్నారు. అన్ని పాయింట్లలోనూ 24 గంటలూ అధికారులను, సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామని విశాఖ జిల్లా ఇన్‌చార్జి డీపీటీవో బలిజి అప్పలనాయుడు తెలిపారు.

మలేరియా, డెంగ్యూ నివారణకు చర్యలు

జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర



దేవరాపల్లిలో స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న డీఎంవో వరహాలు దొర

దేవరాపల్లి: జిల్లాలో మలేరియా, డెంగ్యూ నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని జిల్లా మలేరియా అధికారి కె.వరహాలుదొర తెలిపారు. దేవరాపల్లిలోని కొల్లూరి వారి వీధిలో స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం దోమల మందు పిచికారీ చేపట్టారు. దోమల నియంత్రణ చర్యల పరిశీలన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది మలేరియా, డెంగ్యూ జ్వరాలు నమోదైన ప్రాంతాలలో ఈ పిచికారీకి ముందుగానే చేపడుతున్నట్టు వెల్లడించారు. దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ.పూజ్య మేఘన, సీహెచ్‌వో ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, సబ్ యూనిట్ ఆఫీసర్ జి.మురళీధర్, హెల్త్ అసిస్టెంట్లు అప్పారావు, గోవింద్, సీహెచ్ కృష్ణ పాల్గొన్నారు.

కోర్టుల భవన నిర్మాణాల పూర్తికి కృషి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

చోడవరం రూరల్: చోడవరంలో అసంపూర్తిగా నిలిచిన నాలుగు కోర్టుల నూతన భవన సముదాయ నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి తెలిపారు. శనివారం చోడవరం కోర్టుల సముదాయాన్ని ఆయన సందర్శించారు. ప్రధాన సివిల్ కోర్టుల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో న్యాయవాదులు, సిబ్బందితో మాట్లాడుతూ చోడవరం కోర్టుల సముదాయంలో నెలకొన్న సమస్యలు తనకు ఇదివరకే తెలుసన్నారు. తన విధి నిర్వహణలో భాగంగా నూతన భవన నిర్మాణ పనులు, అదనపు జిల్లా కోర్టుకు బదలాయించాల్సిన కేసుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటానన్నారు. మొదట ఫాస్ట్‌ట్రాక్ కోర్టుగానే ఏ కొత్త కోర్టు అయినా ప్రారంభ మవుతుందని, దానిని రెగ్యులర్‌గా మార్పు చేయాలన్న చోడవరం బార్ అసోసియేషన్ కోరిక న్యాయబద్ధమేనన్నారు.

ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ప్రధాన న్యాయమూర్తిని సత్కరించారు. ముందుగా స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో గణపతిని దర్శించుకున్న జిల్లా ప్రధాన జడ్జికి పురోహితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కోర్టుల సముదాయంలో ఆయన పోలీస్ పరేడ్ గౌరవ వందనం స్వీకరించారు. కోర్టుల ప్రాంగణంలో మొక్కలు నాటారు. సభలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.డేవిడ్ కోర్టు నూతన భవనాల నిర్మాణం, 9వ అదనపు జిల్లా కోర్టును శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయడం తదితర సమస్యలపై వినతిపత్రం అందించారు. 9వ అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం.ప్రవీణ్‌కుమార్, సీనియర్ న్యాయవాది మంథా గౌరీశంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో చోడవరం కోర్టుల న్యాయమూర్తులు సత్తి అరుణశ్రీ, డి.ఉమాదేవి, బార్ అసోసియేషన్ కార్యదర్శి గొర్లె కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.




మొక్కను నాటుతున్న జిల్లా జడ్జి గోపి

నూతన గృహప్రాప్తిరస్తు

- పేదలందరికీ ఇళ్లలో భాగంగా జిల్లాలో కొత్తగా 5,891 ఇళ్లు మంజూరు
- వచ్చే ఏడాది మార్చి నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యం
- ఇప్పటికే గతేడాది టార్గెట్‌లో 10,760 ఇళ్లు పూర్తి



పరవాడలో జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్లు



యలమంచిలి మండలంలో జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్లు

సాక్షి, అనకాపల్లి: సొంతిల్లు పేదవాడి కల.. ఏమి ఉన్నా లేకున్నా తనకంటూ ఓ ఇల్లు ఉండాలని ప్రతి ఒక్కరి కోరిక.. అలా ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల స్వప్నాన్ని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ఇలా ఎంతోమంది పేదలకు గృహయోగం కలిగింది. మొన్నటి ఉగాది టార్గెట్‌లో 96 శాతం పూర్తి చేసి జిల్లాలో 10,760 ఇళ్లను అందించిన ప్రభుత్వం ఇప్పుడు కొత్త ఇళ్లను మంజూరు చేసింది. జిల్లాలో 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు', ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకంలో భాగంగా కొత్తగా 5,891 ఇళ్లు మంజూరు చేశారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. గృహాలు మంజూరైన లబ్ధిదారులకు మూడు పద్ధతుల్లో ఇల్లు నిర్మించే విధంగా వెసులుబాటు కల్పించారు.

నియోజకవర్గాల వారీగా మంజూరైన ఇళ్లు	
పాయకరావుపేట	3,200
నర్సీపట్నం	1205
అనకాపల్లి అర్బన్	1378
అనకాపల్లి రూరల్	108
మొత్తం ఇళ్లు	5,891
కొత్త ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన నిధులు	రూ. 104.61 కోట్లు

లబ్ధిదారుడికి నచ్చిన విధంగానే నిర్మాణం

'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణాలను మూడు విధానాల్లో చేపడతారు. టైప్–1 లో ప్రభుత్వం ఇచ్చిన నమూనా ప్రకారం ఇళ్లు నిర్మించుకోవటానికి అవసరమైన నాణ్యమైన నిర్మాణ సామగ్రి.. లేబర్ చార్జీలకు డబ్బు అందిస్తారు. లబ్ధిదారులే ఇల్లు నిర్మించుకోవాలి. టైప్–2లో లబ్ధిదారులకు నచ్చిన చోట.. ఇష్టమైన విధంగానే ఇంటి నిర్మాణానికి అవసరమైన నిర్మాణ సామగ్రిని వారే తెచ్చుకుని నిర్మించుకుంటే.. దశల వారీగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం డబ్బులు వేస్తుంది. ఇక టైప్–3లో ప్రభుత్వ నమూనా ప్రకారమే.. ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇల్లు కట్టించడం. ఇల్లు మంజూరైన వెంటనే ఈ మూడు విధానాల్లో ఏదో ఒకదాన్ని లబ్ధిదారులే ఎంపిక చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. కచ్చితమైన పురోగతి ఉండే విధంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహించి, అధికారులందరూ క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ నుంచి మండల ప్రత్యేక అధికారులు, హౌసింగ్ జిల్లా స్థాయి అధికారి వరకు అందరూ ప్రత్యేక దృష్టి పెట్టి గృహ నిర్మాణాలను అనుకున్న సమయానికి నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రతి వారం పురోగతిపై సమీక్షిస్తారు.

వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తి



కొత్తగా ఇళ్లు మంజూరు చేయడం పేదలకు వరమే. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఉగాది నాటికి దాదాపుగా టార్గెట్‌ని పూర్తి చేశాం. ఇప్పుడు కొత్తగా మంజూరైన ఇళ్లను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తాం. లబ్ధిదారుల అభీష్టం మేరకే ప్రభుత్వం అందిస్తున్న మూడు విధానాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతాం. ముందుగా బోర్‌వెల్స్ తవ్వించుకునేందుకు ఉచిత విద్యుత్ కనెక్షన్ ఇస్తాం.

–కూర్మనాయుడు, హౌసింగ్ జిల్లా అధికారి, అనకాపల్లి

బైక్‌పై వెళ్తుండగా హఠాత్తుగా మంటలు

ప్రమాదం నుంచి తప్పించుకున్న ద్విచక్ర వాహనదారుడు



కాలిపోయిన బైక్



ప్రమాదం నుంచి బయటపడిన చంటి

కశింకోట: స్థానిక పడమటమ్మ ముఖ ద్వారం వద్ద శనివారం ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం దగ్ధమైంది. స్థానిక హౌసింగ్ కాలనీకి చెందిన కొల్లి చంటి తన బైక్ స్టాండ్ దెబ్బతినడంతో దానికి వెల్డింగ్ ద్వారా మరమ్మతులు చేయించాడు. అక్కడి నుంచి ఇంటికి వెళ్తుండగా ఒక్కసారిగా బైక్ నుంచి మంటలు రాసాగాయి. దీన్ని గమనించి బైక్‌పై నుంచి దూకేసి ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అనంతరం బైక్ మొత్తం కాలిపోయింది. బహుశా వెల్డింగ్ చేయించడం వల్ల ప్రమాదానికి గురై ఉండవచ్చునని భావిస్తున్నారు. ప్రమాదం వల్ల మంటలను స్థానికులు అదుపు చేశారు. రూ.లక్షన్నర నష్టం ఏర్పడింది.

కూలి ఎంత గిట్టుబాటవుతుంది?

- వేతనదారులతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మమేకం
- పలు గ్రామాల్లో విస్తృత పర్యటన



సర్వేయర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శనివారం విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా అచ్చెర్లలోని చెరువులో చేపల పెంపకం కోసం రూ.8 లక్షలతో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మమేకమయ్యారు. రోజుకు ఎంత మేర కూలి గిట్టుబాటు అవుతుందని ప్రశ్నించారు. రోజుకు రూ.250 నుంచి రూ.272 వరకు పనిని బట్టి కూలి వస్తోందని వేతనదారులు బదులిచ్చారు. వేసవి దృష్ట్యా ఎండ దెబ్బ తినకుండా ఉదయం 6 గంటలకు ఉపాధి పనికి వచ్చి 11 గంటల వరకు చేయాలని సూచించారు. తొలుత కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న గదులను సందర్శించారు. పరీక్షలు ఎలా జరుగుతున్నాయని అక్కడి పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అచ్చెర్ల, మోసయ్యపేట, శివారు గోకివానిపాలెం గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న కాలనీ లే–అవుట్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన ఇళ్ల నిర్మించుకుని గృహ ప్రవేశాలు చేయాలన్నారు. లే–అవుట్లలో అవసరమైన మౌలిక సదుపాయలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అచ్చెర్ల ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించి అక్కడి విద్యార్థుల చదువుల తీరును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం చింతలపాలెంలో సమగ్ర భూ రీ– సర్వేలో భాగంగా సర్వే రాళ్ల అమరిక కార్యక్రమాన్ని పరిశీలించారు. ఉపాధి కూలీలను వినియోగించి త్వరితగతిన సర్వే రాళ్లు వేసే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ కె. సురేష్‌నాయుడు, సర్వేయర్ ధనుంజయ్, ఉపాధి పథకం ఏపీవో శివ, అచ్చెర్ల సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు, మోసయ్యపేట సర్పంచ్ మిస్కా రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మిస్కా రమణ, చింతలపాలెం సర్పంచ్ కొట్టి రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గణేష్ లోకల్.. అయ్యన్న నాన్ లోకల్

టీడీపీ కౌన్సిలర్లపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు

నర్సీపట్నం: స్థానికత గురించి మాట్లాడే అర్హత టీడీపీ కౌన్సిలర్లకు లేదని మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, సీనియర్ కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ విమర్శించారు. నర్సీపట్నం కౌన్సిల్ సమావేశం అనంతరం టీడీపీ కౌన్సిలర్లు చేసిన విమర్శలను వారు తిప్పి కొట్టారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ స్థానికుడు కాదనే అర్హత వారికి లేదన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తూర్పు గోదావరి జిల్లా వాసి అని గుర్తించుకోవాలన్నారు. వలస వచ్చిన వ్యక్తికి 40 ఏళ్లు అధికారమిస్తే నర్సీపట్నం అభివృద్ధిని గాలికొదిలేసి ఆస్తులు కూడబెట్టుకున్నాడని దుయ్యబట్టారు. అతనిలా హైదరాబాద్, విశాఖపట్నంలో తమ నాయకుడు గడపలేదన్నారు. స్థానికంగానే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ ప్రజలపై అయ్యన్న గతంలో పన్నుల భారం మోపితే, అందులో 25 శాతం తగ్గించి ఘనత తమ ఎమ్మెల్యేది అన్నారు. దశాబ్దాలుగా విస్తరణకు నోచుకోని మెయిన్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారన్నారు. మెడికల్ కళాశాలను తీసుకువచ్చారన్నారు. వాస్తవాలు తెలుసుకోని మాట్లాడాలని హితువు పలికారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, సుబ్బలక్ష్మి, జగదీశ్వరి, శెట్టి విజయాంబ, మణి, రత్నం, బుల్లిదొర, చినబాబు, సిరసపల్లి నాని, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, స్వామి, బేతిరెడ్డి విజయ్ పాల్గొన్నారు.

కారు ఢీకొని లారీ క్లీనర్ మృతి

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పరవాడ మండలం ఈదులపాక బోనంగి గ్రామానికి చెందిన లారీ క్లీనర్ సలాది సంజీవరావు మృతి చెందాడు. తాళ్లపాలెం హైవే బ్రిడ్జి సమీపంలో హోటల్లో భోజనం చేయడానికి సంజీవరావు రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళుతున్న కారు అతనిని బలంగా ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు.

అంబేడ్కర్ స్మృతివనం రాష్ట్రానికే గర్వకారణం

రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక క్రియేటివ్ హెడ్ జోగినాయుడు



మాట్లాడుతున్న సినీ నటుడు జోగినాయుడు

నాతవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.350 కోట్లతో విజయవాడలో 125 అడుగుల ఎత్తులో అంబేడ్కర్ విగ్రహంతోపాటు స్మృతివనం ఏర్పాటు చేయడం రాష్ట్రానికే గర్వకారణమని రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి క్రియేటివ్ హెడ్, సినీ నటుడు ఎల్.జోగినాయుడు తెలిపారు. శుక్రవారం రాత్రి లింగంపేట పంచాయతీ బుచ్చెంపేటలో ఆటలు పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సభలో మాట్లాడుతూ కోనసీమ జిల్లాకు అంబేడ్కర్ పేరు పెట్టడంతో తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలను అన్ని వర్గాల ప్రజలు గుర్తించుకునే కార్యక్రమాలు సీఎం చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు సైతం రాజకీయాలకు సంబంధం లేకుండా అభినందించాలన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, గ్రామ సర్పంచ్ లోకారపు రాము, వార్డు మెంబరు బొడ్డు నర్సయ్యమ్మ పాల్గొన్నారు.

బంగాళాదుంపల మాటున గంజాయి రవాణా



పోలీసులకు పట్టుబడ్డ గంజాయి

నక్కపల్లి: ఒడిశా నుంచి రాజమండ్రి తరలిస్తున్న గంజాయిని శుక్రవారం రాత్రి నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ శిరీష తెలిపిన వివరాలివి. ఒడిశా నుంచి ఐషర్ వ్యాన్‌లో బంగాళాదుంపలు లోడు కింద బ్యాగుల్లో ప్యాక్ చేసిన 88 కిలోల గంజాయిని టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీల్లో పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో డ్రైవర్ మధ్యప్రదేశ్‌కు హీరాపూర్‌కు చెందిన రాజుభయ్యావర్మను అదుపులోకి తీసుకుని, వ్యాన్‌ను సీజ్ చేశారు. డ్రైవర్‌తో పాటు తణుకు ప్రాంతానికి చెందిన ఈమంది శివధనుష్‌పై కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ సరకు విలువ రూ.2 లక్షలు ఉంటుందని తెలిపారు.

కారు ఢీకొని చిన్నారితో సహా ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన చిన్నారి ఫాతిమా

చింతూరు: మండలంలోని కాటుకపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చత్తీస్‌గఢ్‌కు చెందిన ముగ్గురు గాయపడ్డారు. కుంటకు చెందిన బహదూర్‌ఖాన్ కుటుంబంతో కలసి ద్విచక్ర వాహనంపై భద్రాచలం ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వెనుకనుంచి గుర్తు తెలియని కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రహదారి పక్కనే వున్న చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో బహదూర్‌ఖాన్‌తో పాటు భార్య సాను, 5 ఏళ్ల కూతురు ఫాతిమాకు గాయాలయ్యాయి. వారికి సమీపంలోని ఏడుగుర్లాళ్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం తరలించారు. కాగా వీరిని ఢీకొట్టిన కారును సమీపంలోని మద్దిగూడెం రహదారిలో చింతూరు పోలీసులు కనుగొన్నారు. కారును అటవీ ప్రాంతంలో వదిలేసి నిందితులు పరారయ్యారని, కారును స్వాధీనం చేసుకుని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ మల్లికార్జునరావు తెలిపారు.

క్లుప్తంగా

రేపటి నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ

తుమ్మపాల : ఈ నెల 17 నుంచి రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్–2023కి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌బీఏ గుర్తింపు పొందిన తమ కళాశాలలో చేరే విద్యార్థుల కోసం ఈ శిక్షణ కార్యక్రమం మే నెల 6 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బొజ్జన్నకొండను దర్శించుకున్న బౌద్ధ భిక్షువు


బౌద్ధ స్థూపం వద్ద పూజలు చేస్తున్న మహాథేరో భాంతేజి

అనకాపల్లిటౌన్ : బొజ్జన్నకొండను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని బర్మా బౌద్ధ భిక్షువు వెనరబుల్ ఆయుపాల్ మహాథేరో భాంతేజి అన్నారు. మండలంలోని శంకరం వద్దనున్న ప్రముఖ బౌద్ధక్షేత్రం బొజ్జన్నకొండను శనివారం ఆయన సందర్శించి ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బుద్ధుని విగ్రహాలను, శిల్పకళా నైపుణ్యాలను, కొండ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ప్రాచీన బౌద్ధ క్షేత్రం శిథిలమై పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం, విశాఖ ఉమ్మడి జిల్లాల బౌద్ధ సంఘాల సమాఖ్య కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు నేలపూడి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

అచ్యుతాపురం (అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురంలో శనివారం అభయాంజనేయస్వామి ఆలయ 9వ వార్షికోత్సవం నిర్వహించారు. బాల దుర్గ యంగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేద పండితులు సాయి ఆంజనేయస్వామి వారిని తమలపాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 2,705 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,100
మొదటి రకం	3,850	4,050
రెండో రకం	3,460	3,800
మూడోరకం	3,200	3,430

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
మీటర్	సత్యనారాయణ స్క్రీన్-1
డంజన్స్ అండ్ డ్రాగన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
శాకుంతలం (3డి)	పర్తిసాయి
విడుదల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–1 యూనిట్, బీ పాజిటివ్–34 యూనిట్లు, ఓ పాజిటివ్–44 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

కేబీ రోడ్డుకు మోక్షం


బీఆర్టీ కాలనీ వద్ద జరుగుతున్న రెండో వైపు రోడ్డు పనులు


రామాపురం కాలనీ వద్ద ఒక వైపు పూర్తయిన రోడ్డు

- రూ.32 కోట్లతో కొత్తూరు- బుచ్చెయ్యపేట రోడ్డు
- 24 కి.మీ. పొడవున రోడ్డు, ఇరువైపులా కాలువలు
- శరవేగంగా నిర్మాణ పనులు


కేబీ రోడ్డు.. ఒకప్పటి పరిస్థితి(ఫైల్)

తుమ్మపాల : ఏళ్ల తరబడి అత్యంత దయనీయంగా ఉన్న కొత్తూరు–బుచ్చెయ్యపేట(కేబీ) రోడ్డుకు మోక్షం లభించింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకున్న ఈ రోడ్డును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. 24 కి.మీ. పొడవున డబుల్ లైన్‌తో ఇరువైపులా సీసీ డ్రైన్లు నిర్మిస్తున్నారు. ఈ రోడ్డుపై క్వారీ, క్రషర్ లోడ్లను తీసుకెళ్లే భారీ వాహనాలు తిరుగాడతాయి. దీంతో రోడ్డును చాలా పటిష్టంగా నిర్మిస్తున్నారు.

ఇన్నాళ్లూ.. తాత్కాలిక మరమ్మతులే

అనకాపల్లి మండలం కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల నుంచి బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వరకు విస్తరించి ఉన్న ఈ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.32 కోట్లు నిధులు విడుదల చేసింది. దీంతో పదికాలాల పాటు నిలిచిపోయేలా పటిష్టంగా రోడ్డు పనులు చేపడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు కాంట్రాక్టర్లకు వరంలా ఉండేది. శిథిలావస్థకు చేరిన ఈ రోడ్డు పునరుద్ధరణ పనులకు ప్రజలు నిరసనలు, ధర్నాలు చేసినపుడల్లా.. శిథిల రోడ్డుకు మరమ్మతులు పేరిట తాత్కాలిక పనులు చేపట్టి, క్వారీ, క్రషర్ యాజమాన్యాల నుంచి అందినంత దండుకునేవారన్న ఆక్షేపణలున్నాయి. శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు జరగకపోవడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారినపడేవారు.

నాడు హీనం.. నేడు ఘనం

గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు అత్యంత దారుణంగా ఉండేది. రోడ్డునానుకుని ఉన్న బీఆర్టీ కాలనీ, వేటజంగాలపాలెం, కుంచంగి, కూండ్రం, సుందరయ్యపేటతో పాటు బుచ్చెయ్యపేట మండలంలోని అనేక గ్రామాల ప్రజలు నిత్యం మొత్తుకున్నా అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. ఈ రోడ్డుపై అధికంగా తిరిగే క్వారీ, క్రషర్ల యాజమాన్యాలు అప్పటి నేతలకు కామధేనువులా మారాయి. రోడ్డు మరమ్మతుల పేరిట క్రషర్స్, క్వారీ యాజమాన్యాల నుంచి టీడీపీ నాయకులు వసూళ్లు చేసుకుంటూ, పబ్బం గడిపారన్న ఆరోపణలున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక, ఇచ్చిన మాట మేరకు రోడ్డు పనులకు రూ.32 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు చేపడుతున్నారు.

రెండు మండలాలకు ప్రధాన రహదారి

అనకాపల్లి మండలంలోని పలు గ్రామాలతో పాటు బుచ్చెయ్యపేట మండలానికి చెందిన చాలా గ్రామాల ప్రజలు అనకాపల్లి పట్టణానికి రాకపోకలు సాగించాలంటే ఇదే ప్రధాన రోడ్డు మార్గం. దీంతో పాటు చోడవరం, పాడేరు తదితర ప్రాంతాల నుంచి కూడా అనకాపల్లి చేరుకునేందుకే ఇదే దారి. గత కొన్నేళ్లుగా భారీ గోతులతో, తీవ్ర మరమ్మతులకు గురైన రోడ్డుకు ఇప్పటికి మోక్షం కలగడంతో వాహనదారులు, పరిసర గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే తక్కువ సమయంలోనే రాకపోకలు సాగించవచ్చని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పటిష్టంగా నిర్మిస్తున్నారు



రోజువారీ పనుల్లో భాగంగా అనకాపల్లి వెళ్లి రావడానికి మాకు ఈ రోడ్డే దిక్కు. గతంలో ఈ రోడ్డు భారీ గోతులతో అత్యంత దారుణంగా ఉండేది. వర్షాకాలంలో నడిచేందుకూ వీల్లేని దుస్థితి. రోజూ ఒకట్రెండు ప్రమాదాలు జరిగేవి. క్వారీ, క్రషర్ వాహనాలు రాకపోకల వల్లే ఈ పరిస్థితి. ఇపుడు రోడ్డును చాలా పటిష్టంగా వేస్తున్నారు. చాలా ఏళ్లు మన్నిక వచ్చేలా ఉంది. – **డి.ఈశ్వరరావు, బీఆర్టీ కాలనీ**

త్వరితగతిన నిర్మాణం

కొత్తూరు నుంచి బుచ్చయ్యపేట వరకు రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీలైనంత వేగంగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసు కుంటున్నాం. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఈ పనుల్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో పా టు ఇరువైపులా డ్రైనేజీ కూడా ఏర్పాటు చేస్తున్నాం. – ఎ.ప్రభాకరరావు, ఏఈ, ఆర్ అండ్ బీ

ముగిసిన 'పది' పరీక్షలు


పరీక్షలు ముగిశాక ఆటోల్లో ఇళ్లకు బయల్దేరుతున్న దూర ప్రాంత విద్యార్థులు


నరసింగబిల్లి పరీక్ష కేంద్రం నుంచి ఉత్సాహంగా వస్తున్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్/కశింకోట : జిల్లాలో పదోతరగతి సాంఘిక శాస్త్రం పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 22,228 మందికి గాను 22,109 మంది, ప్రైవేట్ విద్యార్థులు 402 మందిలో 351 మంది హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం తెలిపారు. దీంతో కాంపోజిట్ కోర్స్, సంస్కృతం, అరబిక్, పర్షియన్, ఒకేషనల్ కోర్సు పేపర్లు మినహా ప్రధాన పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 22,630 మంది విద్యార్థులకు 22,460(99.22 శాతం) మంది పరీక్షలకు హాజరుకాగా, 170 మంది గైర్హాజరైనట్టు పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నారు. పదో తరగతి ప్రధాన పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొడుతూ పరీక్షా కేంద్రాల నుంచి బయటికి వచ్చారు.

ఠారెత్తిస్తున్న సూరీడు

కశింకోట : కశింకోట ప్రాంతంలో సూర్య తాపం తగ్గలేదు. గత కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శనివారం కూడా ఉష్ణతాపం అంతే స్థాయిలో ఉంది. అత్యవసర పని ఉన్న వారు తప్ప ప్రజలు ఎక్కువ శాతం ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో ప్రధాన రోడ్లు జన సంచారం లేక వెలవెలబోయాయి. సాయంత్రం వరకు వేడి తగ్గకపోవడంతో వృద్ధులు, పిల్లలు ఇక్కట్లకు గురయ్యారు. వేసవి తాపంతోపాటు విద్యుత్ కోతలు కూడా మొదలయ్యాయి. శనివారం మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరాకు కాసేపు అంతరాయం కలిగింది. అధిక లోడ్ వల్లే విద్యుత్ అంతరాయం ఏర్పడినట్టు ఆ శాఖ సిబ్బంది తెలిపారు.


అధిక ఉష్ణోగ్రతలతో ఖాళీగా దర్శనమిస్తున్న కశింకోట ప్రధాన రహదారి

ఆటో డ్రైవర్లకు అవగాహన

అనకాపల్లిటౌన్ : రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు ఆటో డ్రైవర్లు తమ వంతు సహకరించాలని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను సూచించారు. స్థానిక మెయిన్‌రోడ్డు కశింకోట ఆటోస్టాండ్‌లో శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ రూల్స్, ఆటోలో ఓవర్ లోడ్, మద్యం సేవించి డ్రైవింగ్, నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే ఆటోలను నిలిపేలా ఎవరికి వారు నిబద్ధత చూపాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, వాహనాల రికార్డులను తమ వెంట తీసుకురావాలన్నారు. రహదారులపై విచ్చలవిడిగా వాహనాలు ఆపడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీన్ని తక్షణమే మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

యువత అన్ని రంగాల్లో రాణించాలి

ఇండియన్ మారిటైం యూనివర్సిటీ ఆచార్యులు జోగారావు


సదస్సులో మాట్లాడుతున్న జోగారావు

అనకాపల్లిటౌన్ : యువత ఆర్థికంగా అభివృద్ధి చెంది, ఉన్నతస్థాయిలో రాణించేందుకు నైపుణ్యంతో కూడిన విద్యాప్రమాణాలు అలవర్చుకోవాలని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ ఆచార్యులు జోగారావు అన్నారు. స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు మనోవికాస కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్య అంటే చదువు మాత్రమే కాదని, అనేక రంగాల్లో నైపుణ్యం కలిగి ఉండడమేన్నారు. తద్వారా తాము ఎంచుకున్న రంగంలో అత్యున్నతస్థాయికి చేరుకోగలుగుతారని తెలిపారు. 10వ తరగతి తర్వాత విద్యార్థులకు పాలిటెక్నిక్, వ్యవసాయ పాలిటెక్నిక్ వంటి నైపుణ్యతల విద్య అందుబాటులో ఉందని, ఆ దిశగా ప్రయతించాలని సూచించారు. మెకానికల్, ఎలక్ట్రానిక్స్ కోర్స్‌లో విద్యనభ్యసించిన యువతకు అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్ట్స్, కామర్స్ రంగాల్లో కూడా ఉపాధి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, హిందీ అధ్యాపకుడు మహేంద్రనాథ్ పట్నాయక్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రచారం


నరసింగబిల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో సంక్షేమ, అభివృద్ధి పథకాల బ్రోచర్ల పంపిణీ, స్టిక్కర్ల ప్రదర్శన

కశింకోట : మండలంలోని నరసింగబిల్లిలో శనివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని, తమ మద్దతు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. గృహ యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేవీవీ సత్యనారాయణ, గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు


మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

పరవాడ: భూసార పరీక్షల ప్రయోజనాలపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం నిర్వహించిన భూసార పరీక్షల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మట్టి నమూనాల సేకరణ విధానం, ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కోన రామారావు మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు ఆర్‌బీకే స్థాయిలో రైతులను సమన్వయ పర్చి మట్టి నమూనాలు సేకరించి పరీక్షల కోసం పంపాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా పలువురి రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బండారు రాజశేఖర్, కూండ్రపు అయ్యబాబు, రైతులు గెడ్డం రామారావు, ఇందల ఈశ్వరరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలపై అవగాహన

అచ్యుతాపురం(అనకాపల్లి): నేల సారం, అందుబాటులో ఉండే పోషకాల ఆధారంగా సాగులో ఎరువులను వేయాలని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. శనివారం అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం గ్రామంలో రైతులతో నైరా కళాశాల విద్యార్థులు సాగు విధానాలపై ముచ్చటించారు. సాగుకు ముందు మట్టి పరీక్షలు నిర్వహించడం వల ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. పొలాల్లో మట్టిని సేకరించి, రైతు పేరు, ఊరు, సర్వే నంబర్ వంటి వివరాలను లేబరేటరీకి పంపించాలని సూచించారు. పరీక్ష ఫలితాలను బేరీజు వేసుకుని, పొలంలో లభించని పోషకాలను గుర్తించి వాటిని ఎరువుల రూపంలో అందించేలా వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలు తీసుకోవాలని సూచించారు.

30న కన్యకాపరమేశ్వరి జన్మదిన మహోత్సవం

అనకాపల్లిటౌన్ : స్థానిక మెయిన్‌రోడ్డు శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 30న అమ్మవారి జన్మదిన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 29న సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని వారిచే అమ్మవారి భక్తి సంకీర్తనలు, 30న తెల్లవారుజాము 5.30 గంటలకు అమ్మవారి పల్లకీ ఊరేగింపు, 6.15కు గోపూజ, 6.30కు ప్రార్థనా గాన సంఘం వారిచే నిత్య ప్రార్థనలు, 7.30కు శ్రీ నగరేశ్వర స్వామి, శ్రీ జనార్దన స్వామి వార్లకు అభిషేకాలు, అర్చనలు, 9 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తికి భక్తులచే ఆలయ ముఖమండపంలో ధాన్యాభిషేకం 10 గంటలకు లక్ష మల్లెలతో అమ్మవారికి అర్చన, 10.30 గంటలకు సామూహిక లలితా సహస్రనామ స్తోత్ర పారాయణ ఘనంగా జరపనున్నట్లు తెలిపారు. అనంతరం పేదలకు వస్త్రాల పంపిణీ, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు 102 రకాల స్వీట్లతో సారె ఊరేగింపు ఉంటుందన్నారు. 5.30కు భక్తి సంకీర్తనలు, 6.30 గంటలకు అమ్మవారి ఊంజల్ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రచార భేరి పోస్టర్ ఆవిష్కరణ


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: ఈ నెల 30 వరకు సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రచార భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం మండల కన్వీనర్ పి.మాణిక్యం కోరారు. సీఐటీయూ కార్యాలయంలో శనివారం ప్రచార భేరి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించనున్నట్టు చెప్పారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ అనుకూల ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రత్యేక హోదా. విభజనహామీలు అమలు చేయాలన్నారు. గేదల అప్పారావు, పల్లిఅప్పారావు, కె.అప్పారావు, బి.శ్రీను పాల్గొన్నారు.

వేడుకగా 'ఇంటింటా గోవిందం'


వేంకటేశుని ప్రత్యేక పూజలో పాల్గొన్న సత్యనారాయణ, ధనలక్ష్మి దంపతులు, భక్త బృందం

అనకాపల్లిటౌన్ : మండలంలోని సత్యనారాయణ పురం పోస్టల్ వీధిలో వ్యాపారవేత్త ఎం.సత్యనారాయణ, ధనలక్ష్మి స్వగృహంలో ఇంటింటా గోవింద కార్యక్రమం శనివారం వేడుకగా జరిగింది. జీవీఎంసీ విలీన గ్రామం కొత్తూరు నరసింగరావుపేటకు చెందిన సీతారామభక్త బృందం అధ్యక్షుడు చూచుకొండ రమణ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న మహిళా భక్తులకు మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం


వారోత్సవాల్లో భాగంగా ర్యాలీని ప్రారంభిస్తున్న లక్ష్మణస్వామి


రింగ్‌రోడ్డు జంక్షన్లో వాటర్‌తో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లిటౌన్ : వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.లక్ష్మణ స్వామి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం స్థానిక రింగ్‌రోడ్డులో ర్యాలీ, మాక్‌డ్రిల్ చేపట్టారు. గృహాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సమీపంలోని అగ్నిమాపకశాఖకు సమాచారం అందించడంతో పాటు, మంటలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. వేసవి తాపంతో విద్యుత్ వాడకం పెరిగి, అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. నూతన గృహాలు నిర్మించుకునే సమయంలో చుట్టూ ఖాళీ స్థలాన్ని ఉంచాలని సూచించారు. అవగాహనలో భాగంగా రింగ్‌రోడ్డులో వాటర్ డెమో నిర్వహించగా, ప్రజలు ఆసక్తిగా చూశారు. కార్యక్రమంలో అనకాపల్లి శాఖ అధికారి బి.నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లో ఓల్టేజ్ సమస్యకు పరిష్కారం


కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

అనకాపల్లిటౌన్ : వేసవి దృష్ట్యా లోఓల్టేజ్ విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు దశలు వారీగా కృషిచేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ ఎం.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గొల్లవీధిలో లోఓల్టేజ్ సమస్యపై 84వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ ఫిర్యాదు మేరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ 40కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పట్టణ పరిధిలో డీ1 సెక్షన్ సమీపంలో ఎక్కడైన లోఓల్టేజ్ సమస్య ఉన్నట్లయితే రింగ్‌రోడ్డు విద్యుత్‌శాఖ కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసినా, తమ సిబ్బంది వచ్చి, సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మొగలపల్లి రవితేజ, ఉమ్మిని పైడిరాజు, వాయబోయిన నాగు, మంత్రి మాధవరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ పేరపు రాంబాబు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు


పడమటమ్మ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం

కశింకోట : స్థానిక పడమటమ్మ ముఖ ద్వారం వద్ద వేసవి దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పడమటమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సత్యసాయి భజన మండలి సహకారంతో దీన్ని ప్రారంభించారు. చలి వేంద్రంలో స్థానికులకు మజ్జిగ, మంచినీటిని అందించి దాహార్తి తీర్చుతుండటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.